సాక్షి
కామారెడ్డి

శుక్రవారం । 17 । ఫిబ్రవరి । 2023



ఉత్సాహంగా ఎస్‌పీఎల్ రీజినల్ టోర్నమెంట్

'సాక్షి' ఆధ్వర్యంలో నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో గురువారం నిర్వహించిన ఎస్‌పీఎల్ రీజినల్ క్రికెట్ టోర్నీ ఉత్సాహంగా సాగింది. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హను మంతు, ఏసీపీ కిరణ్‌కుమార్‌లు విజేత లకు బహుమతులు అందజేశారు.

జూనియర్ విభాగంలో రన్నర్‌గా నిలిచిన నిజామాబాద్ పాలిటెక్నిక్ కళాశాల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కలెక్టర్

న్యూస్‌రీల్

21న అథ్లెటిక్స్ ఎంపికలు

కామారెడ్డి అర్బన్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21న అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించనున్నారు. జిల్లా స్థాయి అండర్ 14, 16, 18, 20 బాలబాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈనెల 21న ఉదయం 8 గంటలకు జిల్లాకేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో నిర్వహించే ఎంపిక పోటీలకు హాజరు కావాలని సూచించారు.

5,722 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్ : జిల్లాలో గురువారం కంటి వెలుగులో 5,722 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 654 మందికి అద్దాలను పంపిణీ చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 1,05,072 మందికి కంటి పరీక్షలు చేసి, 17,742 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశామని వైద్యాధికారులు తెలిపారు. ఇంకా 14,395 మందికి కంటి అద్దాలను అందించాల్సి ఉందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



కామారెడ్డి క్రైం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా సాధికారత, ఆర్థిక, సామాజిక రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు అందించనున్నారు. ఆయా అంశాల్లో ప్రతిభ చూపినవారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ రమ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అవార్డులను అందస్తామని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల మహిళలు ఈనెల 20వ తేదీలోగా తమ దరఖాస్తులను జిల్లా సంక్షేమాధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

46 వాహనాలు సీజ్

కామారెడ్డి క్రైం: జిల్లావ్యాప్తంగా పన్నులు చెల్లించకుండా తిరుగుతున్న 46 వాహనాలను గురువారం సీజ్ చేశామని డీటీవో వాణి ఒక ప్రకటనలో తెలిపారు. వాహనాల యజమానులు స్వచ్ఛందంగా వచ్చి త్రైమాసిక పన్నులను చెల్లిస్తే ఇప్పటి వరకు విధించిన జరిమానాలో 50 శాతం రాయితీ ఇస్తున్నామని పేర్కొన్నారు. వాహనాల తనిఖీల్లో పట్టుబడితే 200 శాతం జరిమానా విధిస్తామని హెచ్చరించారు. వాహనదారులు సమీపంలోని మీసేవ కేంద్రం లేదా ఆన్‌లైన్‌లో తమ వాహనాల త్రైమాసిక పన్నులు చెల్లించి భారీ జరిమానా నుంచి మినహాయింపు పొందాలని సూచించారు. త్రైమాసిక పన్ను చెల్లించకుండా నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలపై స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో రెండు పతకాలు



నిజాంసాగర్: సింగితం ఫారెస్ట్ బీట్ అధికారి ఎస్.శ్రీనివాస్ రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో సత్తా చాటారు. ఈనెల 14, 15 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన 200 మీటర్ల పరుగు పందెంలో శ్రీనివాస్ రజత పతకం సాధించారు. అలాగే 400 మీటర్ల పరుగు పందెంలో కాంస్యం పథకాన్ని దక్కించుకున్నారు. రెండు పతకాలను అందుకున్న శ్రీనివాస్‌ను బాన్సువాడ రేంజ్ పరిధిలోని అటవీ అధికారులు అభినందించారు.

నిజామాబాద్‌లో కత్తిపోట్ల కలకలం!

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగరంలోని హమాలీవాడి ప్రాంతంలో మానె శివకుమార్ అనే వ్యక్తిని బైక్‌పై వచ్చిన అగంతకులు కత్తితో పొడిచి పరారయ్యారు. దీంతో స్థానికులు అతడిని జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తరలించారు.

జనవరి 1న బోధన్ శివారులోని నర్సాపూర్ ప్రాంతంలో రౌడీషీటర్ చాట్ల శివ హత్య జరిగింది. ఈ కేసులో మానె శివకుమార్ నిందితుడిగా ఉన్నాడు. ఇతడు వారం క్రితం బెయిల్‌పై విడుదలైనట్లు తెలిసింది. హమాల్‌వాడిలో శివకుమార్ ఉండగా ఇద్దరు వ్యక్తులు హెల్మెట్ పెట్టుకుని బైక్‌పై వచ్చి కత్తులతో దాడి చేశారు. శివకుమార్ కేకలు వేయడంతో వారు పరారయ్యారు. తనపై చాట్ల శివ తండ్రి చాట్ల గోపితో పాటు మరో వ్యక్తి కత్తితో దాడికి పాల్పడ్డారని బాధితుడు తెలిపాడు. రోజు చాట్ల శివ తండ్రి గోపి, ఫోన్ చేస్తూ మెసేజీలు పెడుతూ బెదిరిస్తున్నాడని శివకుమార్ తెలిపారు. మూడో టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వేగంగా దోపిడీ!

రోడ్డెక్కితే జేబుకు చిల్లే!

- ఎక్కడా కనిపించని స్పీడ్ లిమిట్ బోర్డులు
- మితిమీరిన వేగం పేరిట జరిమానాలు
- లబోదిబోమంటున్న వాహనదారులు





■ నిజామాబాద్‌కు చెందిన రాకేశ్ కుటుంబ సభ్యులతో కలిసి చుక్కాపూర్ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయానికి వెళ్తుండగా.. మార్గమధ్యలో వేగ పరిమితి దాటారంటూ ఈ-చలానా మెసేజ్ వచ్చింది. రూ.1,035 జరిమానా విధించారని, కానీ ఎక్కడా స్పీడ్ లిమిట్ బోర్డులు కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

■ మెదక్‌కు చెందిన నరేశ్ కుటుంబ సభ్యులతో కలిసి కారులో కామారెడ్డి-సిరిసిల్ల రహదారి మీదుగా వేములవాడ ఆలయ దర్శనానికి బయలుదేరారు. మాచారెడ్డి మండల కేంద్రానికి చేరుకునేలోపు ఆయన సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. వేగ పరిమితి దాటారంటూ రూ.1,035 జరిమానా విధించారు.

ట్రాఫిక్ నిబంధనల అమలు పేరుతో సర్కారు 'స్పీడ్ గన్' చూపి దారిదోపిడీకి పాల్పడుతోంది. రోడ్డెక్కితే చాలు వాహనదారుడిని ఏదో ఒక విధంగా దోచుకుంటోంది. ఎక్కడా సూచిక బోర్డులు ఏర్పాటు చేయకుండానే.. మితిమీరిన వేగం పేరుతో ఇష్టారాజ్యంగా ఫైన్‌లు విధిస్తుండడంతో వాహనదారులు అసహనానికి గురవుతున్నారు. అడ్డగోలు ఫైన్‌లు చెల్లించలేక ఇబ్బందిపడుతున్నారు.

సాక్షి, కామారెడ్డి : ప్రమాదాలను నివారించడంలో భాగంగా వాహనాల వేగాన్ని కట్టడి చేయడానికి పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. స్పీడ్ గన్‌ల ద్వారా వాహనదారులకు జరిమానాలు విధిస్తోంది. జాతీయ రహదారులతో పాటు రాష్ట్రీయ రహదారులపైనా పోలీసులు స్పీడ్ గన్‌ల ద్వారా జరిమానాలు విధిస్తున్నారు. రోడ్డుపక్కన చెట్ల మాటున స్పీడ్ గన్‌తో కాపు కాచి, వేగంగా వెళ్లే వాహనదారులను కెమెరాలో బంధించి ఈ-చలానాలు విధిస్తున్నారు. వాహనదారుల సెల్‌ఫోన్‌కు మెస్సేజ్ వచ్చేదాకా తాము పోలీసు కెమెరాకు చిక్కామన్నది తెలియడం లేదు. గతేడాది జిల్లాలో జరిమానాలు రూ.10 కోట్లు దాటాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

సూచికల జాడేది?

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించేవారికి జరిమానా విధించడాన్ని ఎవరూ తప్పుపట్టరు. కానీ వేగ పరిమితికి సంబంధించి ఎక్కడా సూచిక బోర్డులు ఏర్పాటు చేయకుండా మితిమీరిన వేగం పేరుతో జరిమానాలు విధిస్తుండడాన్ని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. జిల్లామీదుగా వెళ్లే కేకేవై రోడ్డు(కరీంనగర్-కామారెడ్డి-ఎల్లారెడ్డి)పై వాహనాలు ఎక్కడ ఎంత వేగంతో వెళ్లాలన్న దానికి సంబంధించి బోర్డులు లేవు. కేవలం క్యాసంపల్లి మూలమలుపు వద్ద ప్రమాదాల నివారణకు ఇటీవల స్పీడ్ లిమిట్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కానీ దారిపొడవునా ఎక్కడా స్పీడ్ లిమిట్‌కు సంబంధించి వాహనదారులకు తెలిసేలా బోర్డులు లేవు.

కామారెడ్డి పట్టణానికి సిరిసిల్ల రోడ్డు మీదుగా మాచారెడ్డి, బీబీపేట, దోమకొండ, సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట, దుబ్బాక, గంభీరావుపేట తదితర ప్రాంతాల ప్రజలు కార్లు, బైకులపై వచ్చిపోతుంటారు. అలాగే ఎల్లారెడ్డి వైపు నుంచి ఎల్లారెడ్డి, లింగంపేట, తాడ్వాయి, నాగిరెడ్డిపేట, నిజాంసాగర్ తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తారు. గాంధారి, రామారెడ్డి, సదాశివనగర్ తదితర మండలాల ప్రజలు కూడా రెగ్యులర్‌గా కామారెడ్డికి వచ్చి వెళ్తారు. ఆయా రహదారులపై వేగ పరిమితికి సంబంధించిన బోర్డులు లేవు. దీంతో ఎంత వేగంతో వెళ్తే జరిమానా పడుతుందన్న విషయమై వాహనదారులకు అవగాహన కొరవడింది. పరిమిత వేగం దాటి ప్రయాణించారంటూ ఫోన్‌కు చలానా మెస్సేజ్ వచ్చేదాకా వారికి తెలియడం లేదు.

పెండింగ్ చలానాల వసూళ్లపైనే దృష్టి..



పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండడంతో రోడ్డు పక్కన వేచి చూస్తున్న వాహనదారులు

నిత్యం పోలీసులు వాహనాలను ఆపి చలానాలు ఏమేరకు పెండింగ్‌లో ఉన్నాయో ట్యాబ్‌లో పరిశీలించి, పెండింగ్ ఉంటే వాటిని వసూలు చేస్తుంటారు. దీంతో ఎక్కడైనా రోడ్డుమీద పోలీసులు ఉన్నారంటే చాలు వాహనదారులు దూరంగా తమ వాహనాలను నిలిపి వారు వెళ్లేంత వరకు వేచి ఉంటున్నారు. కొందరు పోలీసుల కంటపడకుండా ఉండేందుకు వేరే మార్గాలలో వెళుతున్నారు. కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డి, కామారెడ్డి నుంచి మాచారెడ్డి, కామారెడ్డి నుంచి టేక్రియాల్ రూట్లలో నిత్యం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుంటారు. అలాగే జిల్లా కేంద్రంలో నిజాంసాగర్ చౌరస్తా, రామారెడ్డిచౌరస్తా తదితర ప్రాంతాల్లో వాహనదారులను ఆపి, పెండింగ్ చాలనాలు ఉంటే వసూలు చేస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల నుంచి ని త్యం పట్టణానికి వచ్చే ప్రజలు పోలీసుల తనిఖీలతో ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పట్టించుకోకుండా వసూళ్లపైనే దృష్టి పెట్టారన్న విమర్శలున్నాయి. స్పీడ్‌కు సంబంధించిన సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే వాహనదారులు ఆ పరిమితి దాటి వెళ్లకుండా ఉండేందుకు అవకాశం ఉంటుంది. అలాగే వేగ పరిమితిపై అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తే వాహనదారులు అర్థం చేసుకునే అవకాశాలుంటాయి. తద్వారా ప్రమాదాలు తగ్గడానికీ ఆస్కారం ఉంటుంది. ఆ దిశగా పోలీసులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

'చాంపియన్లుగా ఎదగాలి'



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం: చెస్ క్రీడాకారులు చాంపియన్ షిప్ సాధించడానికి పట్టుదలతో కృషి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో మహిళలకు జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహించారు. పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం, స్నేహభావం పెరుగుతాయన్నారు. టోర్నీలో 40 మంది మహిళలు పాల్గొన్నారు. మాచారెడ్డి మండలం ఫరీద్‌పేట్ గ్రామానికి చెందిన పి.పావని విజేతగా, భిక్కనూరు మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన ఫర్హీన్ నాజ్ ద్వితీయ స్థానంలో నిలిచారని జిల్లా యువజన, క్రీడల అధికారి దామోదర్ రెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీలో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా చదరంగం అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు మోహన్ రెడ్డి, సంజీవ్, రామకృష్ణ, విజయలక్ష్మి, వరద, సబిత, అర్చన తదితరులు పాల్గొన్నారు.

పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి

- ప్రభుత్వ భూములను రక్షించాలి
- వీసీలో కలెక్టర్లతో సీఎస్ శాంతికుమారి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, అధికారులు

కామారెడ్డి క్రైం: కంటి వెలుగు, పోడు పట్టాల పంపిణీ, హరితహారం లాంటి కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. గురువారం ఆమె హైదరాబాద్ నుంచి కలెక్టర్‌లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కంటి వెలుగులో అవసరమైన మందులు, రీడింగ్ కళ్లద్దాలు తెప్పించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పోడు భూములకు పట్టాలు పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. జీవో నంబర్ 58, 59 కింద వచ్చిన దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములకు కంచెలు ఏర్పాటు చేయాలన్నారు. హరితహారానికి ఏర్పాట్లు చేయాలన్నారు.

జిల్లాలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని కామారెడ్డి కలెక్టర్ జితేష్ వి పాటిల్ సీఎస్‌తో పేర్కొన్నారు. పోడు పట్టాలకు సంబంధించిన సమాచారం గతంలోనే అందించామన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పట్టాలు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. వీసీలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, డీఎఫ్‌వో నిఖిత, డీఆర్‌డీవో సాయన్న, డీపీవో శ్రీనివాస రావు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయ లక్ష్మి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాన్ని అభివృద్ధి చేయాలంటూ దీక్ష



సిర్పూర్‌లో దీక్ష చేస్తున్న లక్ష్మణ్, గ్రామస్తులు

మద్నూర్: తమ గ్రామాన్ని అభివృద్ధి చేయాలని కోరుతూ డోంగ్లీ మండలంలోని సిర్పూర్ గ్రామానికి చెందిన ఎస్.లక్ష్మణ్ గురువారం దీక్షకు దిగాడు. అతడికి పలువురు గ్రామస్తులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ సొంత గ్రామమైన సిర్పూర్‌లో అభివృద్ధి పనులకు ఎంపీ కుటుంబ సభ్యులే అడ్డుపడుతున్నారని ఆరోపించాడు. గ్రామంలో ఆలయాలకు సంబంధించిన భూ ములతోపాటు దళితుల భూములను కబ్జా చేశారన్నాడు. డీసీసీబీ డైరెక్టర్ శ్రీరాంపటేల్, సిర్పూర్ సర్పంచ్‌లపై ఆరోపణలు చేశాడు. కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని కోరాడు.

కొనుగోళ్లకు ప్రణాళిక సిద్ధం చేయాలి



కామారెడ్డి క్రైం: ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ జిల్లా అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం యాసంగి ధాన్యం కొనుగోళ్లపై వ్యవసాయ, మార్కెటింగ్, ఐకేపీ, సివిల్ సప్లై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ధాన్యం దిగుబడిని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వే యాలన్నారు. సరిపడా గన్నీ బ్యాగులను సిద్ధం చే యాలని, కొనుగోళ్లకు సంబంధించిన యంత్రాలు, ఇతర సామగ్రిని సమకూర్చాలని సూచించారు. మార్కెటింగ్, వ్యవసాయ, సహకార శాఖల అధికారులు, ఐకేపీ అధికారులు సమన్వయంతో పనిచేసి ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, డీఎస్‌వో పద్మ, డీఏవో భాగ్యలక్ష్మి, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య పాల్గొన్నారు.

అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలి

కామారెడ్డి టౌన్: జిల్లాలో అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని జర్నలిస్టులు కోరారు. గురువారం క్యాంపు కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. కలెక్టర్ వెంటనే డీపీఆర్వో రవి కుమార్‌తో ఫోన్ ద్వారా మాట్లాడి 23వ తేదీలోగా కార్డులు అందేలా చూడాలని ఆదేశించారు. జాప్యంపై డీపీఆర్వో తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు బాలార్జున్ గౌడ్, రజినీకాంత్, భూపతి, భాస్కర్, అంజి పాల్గొన్నారు.

మతమార్పిడులను నిరోధించాలి

- సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్
- రామేశ్వర్‌పల్లిలో శివాజీ విగ్రహావిష్కరణ



శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అప్పాల ప్రసాద్, కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

భిక్కనూరు: మతం మారితే మరణించినట్లేనని, బలవంతపు మతమార్పిళ్లను నిరోధించాల్సిన ఆవశ్యకత ఉందని సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ పేర్కొన్నారు. రామేశ్వర్‌పల్లి ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన శివాజీ భారీ విగ్రహాన్ని బుధవారం సద్గురు మహదేవ్ స్వామీజీతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అంతకుముందు హిందుస్థాన్ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతమైన అతి పురాతనమైన హిందూ సంస్కృతి, సంప్రదాయాలవైపు ప్రపంచమంతా ఆకర్షితమవుతోందన్నారు. కానీ ఇక్కడ మాత్రం కొందరు ఇతర మతస్తుల మాయమాటలు నమ్మి వారి మతాలవైపు చూస్తుండడం శోచనీయమన్నారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ హిందూమత వ్యాప్తి కోసం యుద్ధం చేయలేదన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడేందుకే అఫ్జల్‌ఖాన్, ఔరంగజేబు లాంటి వారితో పోరాడారన్నారు. ఔరంగజేబు దక్షిణ భారతంవైపు రాకుండా నిలువరించిన ఘనత శివాజీదేనన్నారు. ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఛత్రపతి శివాజీ అనుచరుడి వారసురాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు దేశభక్తి, దైవభక్తిపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి హిందువు రోజూ దైవ ప్రార్థన చేయాలని సద్గురు మహదేవ్ స్వామీజీ సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పోతిరెడ్డి, ఎంపీటీసీ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, విండో చైర్మన్ నాగార్తి భూంరెడ్డి, బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి సందుగారి రవీందర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎడ్ల రాజిరెడ్డి, ఉప సర్పంచ్ యశోద రమేశ్, వీడీసీ అధ్యక్షుడు తక్కళ్ల నర్సరెడ్డి, ఉపాధ్యక్షుడు పైతరి స్వామి, సాందీపని విద్యాసంస్థల చైర్మన్ హరిస్మరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'యూనిట్ల ఏర్పాటులో జిల్లా టాప్'



మాట్లాడుతున్న డీపీఎం రమేష్‌బాబు

నాగిరెడ్డిపేట: బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల ద్వారా మహిళా సంఘాల సభ్యులతో జిల్లావ్యాప్తంగా 5,523 ఎంటర్‌ప్రైజెస్ యూనిట్లను ఏర్పాటుచేశామని ఐకేపీ డీపీఎం రమేష్‌బాబు తెలిపారు. యూనిట్ల ఏర్పాటులో రాష్ట్రంలో జిల్లా మొదటిస్థానంలో ఉందన్నారు. నాగిరెడ్డిపేట ఐకేపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో మహిళాసంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలను ఇప్పించి కిరాణా దుకాణాలు, టిఫిన్ సెంటర్లు, ఇతర దుకాణాలను ఏర్పా చేయించామన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లింకేజీ ద్వారా జిల్లాలో 15,019 సంఘాలకు రూ. 854.80 కోట్లు రుణాలుగా ఇవ్వాలని లక్ష్యం కాగా.. ఇప్పటివరకు 12,148 సంఘాలకు రూ. 708.57 కోట్ల రుణాలు ఇచ్చి 83 శాతం లక్ష్యాన్ని చేరుకున్నామని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో స్త్రీనిధి ద్వారా రూ. 124 కోట్ల రుణాలు ఇవ్వాల్సి ఉండగా.. ఇప్పటివరకు రూ. 72 కోట్లు ఇచ్చామన్నారు. స్త్రీనిధి కింద బకాయిపడ్డ రుణాల వసూళ్ల కోసం మహిళా సంఘాల సభ్యులతో సబ్‌కమిటీలను ఏర్పాటు చేశామని తెలిపారు. అవసరమైతే రుణ బకాయిదారులపై ఆర్‌ఆర్ యాక్టు ప్రయోగిస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట స్త్రీనిధి రీజనల్ మేనేజర్ శ్రీనివాస్, ఏపీఎం జగదీశ్ ఉన్నారు.

శివాజీని స్ఫూర్తిగా తీసుకోవాలి



శివాజీ విగ్రహం వద్ద మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటరమణారెడ్డి

భిక్కనూరు: నేటి యువత శివాజీని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటరమణరెడ్డి సూచించారు. గురువారం రామేశ్వర్‌పల్లిలోని శివాజీ విగ్రహాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు శివాజీ, స్వామి వివేకానంద తదితరుల జీవితాల గురించి వివరించాలన్నారు. శివాజీ విగ్రహావిష్కరణలో పాల్గొన్న సుమారు మూడు వేల మందికి వెంకటరమణారెడ్డి అన్నదానం చేశారు. ఆయన వెంట బీజేపీ మండలాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, నేతలు బస్వరెడ్డి, విష్ణురెడ్డి, గణేశ్‌రెడ్డి, నర్సింలు, నరేందర్‌రెడ్డి, ఏక్‌నాథ్, బాల్‌లింగం, శ్రీనివాస్, సాయిలు, భూపాల్‌రెడ్డి, హిందుస్థాన్ యూత్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

శివరాత్రికి ప్రత్యేక బస్సులు



మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం మల్లేశం

రామారెడ్డి: మహాశివరాత్రి సందర్భంగా మద్దికుంటలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ స్వయంభూ బుగ్గరామలింగేశ్వరుడి ఆలయానికి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు కామారెడ్డి డిపో మేనేజర్ మల్లేశం తెలిపారు. గురువారం ఆయన బుగ్గరామలింగేశ్వరుడిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రి సందర్భంగా లక్ష నుంచి రెండు లక్షల మంది బుగ్గకు వచ్చే అవకాశాలున్నాయన్నారు. రద్దీకి అనుగుణంగా కామారెడ్డి డిపోనుంచి బస్సులను నడుపుతామన్నారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు కామారెడ్డి పాత బస్టాండ్ నుంచి బస్సులను అందుబాటులో ఉంచుతామన్నారు. నిజామాబాద్ డిపో-1 నుంచి బుగ్గకు నేరుగా బస్సులు నడుస్తాయని సర్పంచ్ రాంరెడ్డి తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ప్రధాన పూజారి ప్రభాకర్ పంతులు పేర్కొన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న పోలీసుల క్రీడలు



ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ హెడ్ క్వార్టర్ గ్రౌండ్‌లో క్రీడలు కొనసాగుతున్నాయి. గురువారం రెండో రోజూ వాలీబాల్, కబడ్డీతోపాటు క్రికెట్ పోటీలు నిర్వహించారు.

తల్లిదండ్రుల విగ్రహాలు ఏర్పాటు



నందిపేట్: నందిపేటలోని శ్రీ కేదారీశ్వర ఆశ్రమ ప్రాంగణంలో గురువారం ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహరాజ్ తన తల్లిదండ్రుల విగ్రహాలను ఆవిష్కరించారు. మంగిరాములు మహరాజ్ తల్లిదండ్రులైన మంగి లక్ష్మమ్మ, సాయిలు మెదక్ జిల్లా దుబ్బాక మండలం పోతిరెడ్డిపేట్ గ్రామం నుంచి 40 ఏళ్ల క్రితం నందిపేట గ్రామానికి బతుకు దెరువు కోసం వలస వచ్చారు. తన తల్లిదండ్రుల విగ్రహాలను రాజస్థాన్ నుంచి తెప్పించి ఆశ్రమ ముఖద్వారం ముందు ప్రత్యేక మందిరాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాశీ నుంచి వచ్చిన సాధువులతో పాటు ఆశ్రమ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాణ్యతతో పనులు చేపట్టాలి



ఎల్లారెడ్డిరూరల్: వైకుంఠధామం పనులను నాణ్యతతో చేపట్టాలని మున్సిపల్ రాష్ట్ర అడ్మినిస్ట్రేటివ్ అధికారి తిరుపతి కుమార్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డిలో నిర్మిస్తున్న వైకుంఠధామాన్ని ఆయన పరిశీలించారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న మోడల్ విధానంలో ఎల్లారెడ్డిలో వైకుంఠధామం నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. మున్సిపల్ కామారెడ్డి డీఈ సంతోష్, ఏఈ వినోద్, బీఆర్ఎస్ నాయకులు రామప్ప, రాజు, సతీష్ ఉన్నారు.

భగీరథ పైప్‌లైన్ లీకేజీ



కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలం గర్గుల్ నుంచి రామారెడ్డి వెళ్లే దారిలో ప్రధాన రహదారి పక్కనే మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ అయి నీరంతా వృథాగా పోయింది. సంబంధిత అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేశారు.

వన్యప్రాణుల దాహం తీర్చడానికి ట్యాంకుల నిర్మాణం



నిజాంసాగర్: వన్యప్రాణుల దాహార్తితో పాటు భూగర్భజలాల పెంపు కోసం అటవీ ప్రాంతాల్లో పర్క్యులేషన్ ట్యాంకులు నిర్మిస్తున్నామని పిట్లం అటవీశాఖ రేంజ్ అధికారి సంజయ్‌గౌడ్ తెలిపారు. గురువారం జుక్కల్ మండలం కౌలాస్ సెక్షన్‌లో నిర్మిస్తున్న పర్క్యులేషన్ ట్యాంకులను ఆయన పరిశీలించారు. రేంజ్ పరిధిలో 30 ట్యాంకులు నిర్మిస్తున్నామన్నారు.

శత శాతమే లక్ష్యంగా..

- 'పది'లో ఉత్తమ ఫలితాల కోసం కసరత్తు
- ప్రభుత్వ బడుల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు
- వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



తలమడ్ల పాఠశాలలో ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న విద్యార్థులు

రాజంపేట: పాఠశాల స్థాయిలో విద్యార్థుల భవితవ్యాన్ని తేల్చేవి.. ఉన్నత విద్యకు బాటలు వేసేవి పదో తరగతి పరీక్షలు. ఈ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యా శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. పదో తరగతి వార్షిక పరీక్షలు ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభం కానున్నాయి. వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లా విద్య శాఖ అందరు విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యేలా ప్రణాళికలు రూపొందించి, పరీక్షలకు సన్నద్ధం చేస్తుంది. ఇప్పటికే సిలబస్ పూర్తి చేసిన ఉపాధ్యాయులు రివిజన్ చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక తరగతుల సమయంలో విద్యార్థులకు స్నాక్సు అందించేందకు ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.15 చొప్పున ప్రభుత్వం ఖర్చు చేస్తుంది.

ప్రస్తుత విద్యా సంవత్సరంలో జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో సూమారు 7,052 మంది పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రతి పాఠశాలలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. తరగతిలోని విద్యార్థులను వారి స్థాయిని బట్టి గ్రూపులుగా ఏర్పాటు చేసి, ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతి విద్యార్థి ప్రగతిపై సబ్జెక్టు వారీగా ఉపాధ్యాయులు చర్చించి దిశ నిర్దేశం చేస్తున్నారు.

శ్రద్ధగా చదువుతున్నాం



పాఠశాలలో ఉదయం సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో మాలో బాగా చదవాలనే కోరిక పెరిగింది. అనుమానాలు ఎంటే ఉపాధ్యాయుల ద్వారా నివృత్తి చేసుకుంటూ శ్రద్ధగా చదువుకుంటున్నాం. – చింతకింది శ్రీనిధి, విద్యార్థిని, తలమడ్ల

అల్పాహారం అందజేస్తున్నారు



ప్రత్యేక తరగతుల సమయంలో ఉపాధ్యాయులు మాకు అల్పాహారం అందిస్తున్నారు. ఉపాధ్యాయులు చెప్పే విషయాలు విని మంచి మార్కులు సాధించేందుకు ప్రయత్నిస్తున్నా.

– ర్యావ కుమార్, విద్యార్థి, తలమడ్ల

విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాం



పదో తరగతి ప్రతి విద్యార్థికి జీవితంలో తొలిమెట్టు లాంటిది. విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా అనుమానాలు నివృత్తి చేస్తున్నాం. ప్రతి పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా కృషి చేస్తున్నాం.

– రామస్వామి, ఎంఈవో, రాజంపేట

బాధ్యతలు స్వీకరించిన ఏఎంసీ చైర్మన్



బాధ్యతలు తీసుకుంటున్న చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్

బిచ్కుంద: బిచ్కుంద మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్‌గా ఎంపికైన నాగ్‌నాథ్ పటేల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. వైస్ చైర్మన్‌గా గుండెరావు, డైరెక్టర్లు బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతుల కోసం ఎల్లవేళల అందుబాటులో ఉండి వారి అభ్యున్నతి కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. మార్కెట్ ఆవరణలో ధాన్యం నిలువ కోసం గోదాంలు, ఆరబెట్టుకోడానికి ఫ్లాట్‌ఫామ్‌లు ఏర్పాటు చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అశోక్ పటేల్, బీఆర్ఎస్ నాయకులు రాజు, మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

పుస్తకాలు చదవాలి



గ్రంథాలయంలో పుస్తకాలను అందజేస్తున్న గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ పున్న రాజేశ్వర్

రామారెడ్డి: నేటి ఆధునిక యుగంలో ఫోన్ల వినియోగం పెరిగిపోయిందని, యువత, విద్యార్థులు ఫోన్లను పక్కన పెట్టి పుస్తకాలు చదవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్ అన్నారు. మండలంలోని రెడ్డిపేట గ్రామంలోని గ్రంథాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. రెడ్డిపేట పెద్ద గ్రామం కావడంతో ఎమ్మెల్యే గంప గోవర్ధన్, గ్రామస్తుల సహకారంతో గ్రంథాలయం ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే శాశ్వత గ్రంథాలయం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు పుస్తకాలను, డిక్షనరీలను పంపిణీ చేశారు. సర్పంచు సునందన, ఉపసర్పంచ్ బాలయ్య, ప్రభాకరరావు, ప్రసాద్, రాజనర్స్, హనుమడ్లు, శంకర్, వేణు పాల్గొన్నారు.

వివాదాస్పద భూముల పరిశీలన



నిరసన తెలుపుతున్న రైతులు

ఇందల్వాయి: గుట్టలు మాయం అనే శీర్షికన బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అటవీ శాఖ అధికారులు స్పందించారు. గన్నారం శివారులోని 1223 సర్వే నంబరులోని వివాదాస్పదంగా సాగుకు సిద్ధం చేస్తున్న భూములను ఎఫ్‌డీవో రాంకిషన్ గురువారం పరిశీలించారు. ఇంతవరకు ఆ భూమి అటవీ శాఖ పరిధిలోకి రాలేదని, సమస్య పరిష్కారం అయ్యే వరకు రైతులెవరూ ఆ భూముల్లో ఎలాంటి పనులు చేపట్టవద్దన్నారు. వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామన్నారు. రైతులు తమవద్ద ఉన్న పట్టా పాస్‌పుస్తకాలు, ఇతర ధ్రువ పత్రాలతో అటవీ, రెవెన్యు కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీంతో సుమారు 20 మంది రైతులు అటవీ, రెవెన్యు శాఖల కార్యాలయాల ఎదుట పట్టా పుస్తకాలతో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ రోజా, ఎఫ్ఆర్‌వో హిమచందనతో ఎఫ్‌డీవో చర్చించారు. 1223 సర్వే నంబరుకి సంబంధించి పూర్తి రికార్డులు సిద్ధం చేయాలన్నారు.

యోగా తరగతులు ప్రారంభం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయం గర్ల్స్ హాస్టల్‌లోని సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం వీసీ రవీందర్ యోగా శిక్షణ తరగతులను ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యంగా ఉంటామన్నారు. మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. యోగా శిక్షణ కోసం యోగా గురువు సిద్ధిరాములును నియమించారు. విద్యార్థులు యోగా తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బయోటెక్నాలజీ విభాగంలో అంతర్జాతీయ సదస్సు

డిచ్‌పల్లి: తెలంగాణ విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగంలో ఈ నెల 21 నుంచి 23 వరకు అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు సెమినార్ కో ఆర్డినేటర్ ప్రవీణ్ తెలిపారు. బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ ఇన్ బయోలాజి అండ్ మెడిసిన్-2023 అనే అంశంపై మూడు రోజుల పాటు సదస్సు ఉంటుందన్నారు. ముఖ్య అతిథిగా ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి హాజరవుతారన్నారు. సదస్సులో ప్రఖ్యాత శాస్త్రవేత్తలు ప్రసంగిస్తారని చెప్పారు.

బాల్య వివాహం నిలిపివేత

మోపాల్: మండలంలోని మంచిప్పలో బాల్య వివాహాన్ని జిల్లా బాలల పరిరక్షణ కమిటీ, సీడీపీవో అధికారులు గురువారం అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన అబ్బాయికి గాంధారి మండలానికి చెందిన అమ్మాయితో వివాహం నిశ్చయమైంది. గురువారం పెళ్లి ఉండగా పెళ్లి కుమారుడికి 21 ఏళ్లు నిండకపోవడంతో విషయం తెలుసుకున్న అధికారులు అడ్డుకున్నారు. అనంతరం పెద్దల సమక్షంలో గ్రామపంచాయతీలో కౌన్సెలింగ్ నిర్వహించి, ఒప్పందం పత్రం రాయించుకున్నారు. ఒక వేళ పెళ్లి జరిపిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి


రెంజల్: మండలంలోని దూపల్లి గ్రామానికి చెందిన పల్ల చిన్న సాయిలు(35) చికిత్స పొందుతూ నిజామాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం మృతి చెందినట్లు ఎస్సై పండ్ల సాయన్న చెప్పారు. ఈ నెల 14న అనారోగ్య కారణాలతో సాయిలు గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతుడి భార్య నవనీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

నడ్కుడకు చెందిన వృద్ధుడు..

నందిపేట్: మండలంలోని నడ్కుడ గ్రామానికి చెందిన కుమ్మరి మదర్ (63) చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. కుమ్మరి మదర్ బుధవారం వ్యక్తిగత పని నిమిత్తం నవీపేట మండలం నాళేశ్వర్ గ్రామానికి వెళ్లి బైక్‌పై తిరిగి వస్తుండగా నికాల్‌పూర్ సమీపంలో అదుపు తప్పి కింద పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయాలు కాగా చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు కుమ్మరి మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

చెరువులోకి దూసుకెళ్లిన కారు

- నలుగురిని కాపాడిన స్థానికులు



నస్రుల్లాబాద్(బీర్కూర్): కారు అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లిన ఘటన బీర్కూర్ మండలం మల్లాపూర్ శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం .. నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలం అక్బర్ నగర్ గ్రామానికి చెందిన నలుగురు యువకులు మల్లాపూర్ గ్రామంలో జరిగిన శుభ కార్యానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో బైరాపూర్-మల్లాపూర్ గ్రామాల మధ్య ఉన్న చెరువులోకి కారు దూసుకెళ్లింది. స్థానికులు అప్రమత్తం అయి కారులో ఉన్న నలుగురిని బయటకు తీశారు. అందులో ఒకరు స్పృహ తప్పారని, ముగ్గురి పరిస్థితి బాగానే ఉందని స్థానికులు తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు 108లో క్షతగాత్రులను బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి నిజామాబాద్‌కు తీసుకెళ్లినట్లు ఏఎస్సై సీతారామమ్మ తెలిపారు.

పోచారం ప్రాజెక్టులో యువకుడి గల్లంతు



ప్రాజెక్టు వద్ద పరిశీలిస్తున్న అధికారులు

నాగిరెడ్డిపేట: మండలంలోని పోచా రం ప్రాజెక్టులో గురువారం పోచా రం గ్రామానికి చెందిన పుప్పాల బాబు(32) గల్లంతయ్యాడు. ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువలోకి నీటిని విడుదల చేసే గేట్ల వద్ద బాబు గల్లంతయినట్లు గ్రామస్తులు చెప్పారు. విషయం తెలుసుకున్న నాగిరెడ్డిపేట ఇన్‌చార్జి తహసీల్దార్ రాందాస్, ఎస్సై ఆంజనేయులు ప్రాజెక్టు వద్దకు చేరుకొని గ్రామానికి చెందిన జాలర్ల ద్వారా గాలింపుచర్యలు చేపట్టారు. ప్రాజెక్టులో వ్యక్తి గల్లంతయ్యాడనే విషయం తెలిసి అధిక సంఖ్యలో ప్రజలు ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. గురువారం చీకటి పడడంతో గాలింపు చర్యలను నిలిపివేశారు.

బైక్, కారు ఢీ

ఆర్మూర్‌టౌన్: ఆలూర్ మండల కేంద్రం శివారులో బైక్ కారు ఢీకొన్న ఘటనలో నిజామాబాద్‌కు చెందిన జల్ల శ్రీనివాస్‌కు తీవ్ర గాయలయ్యాయి. బుధవారం రాత్రి శ్రీనివాస్ వెల్మల్ గ్రామంలో పనులు ముగించుకొని ఆలూర్‌కు వస్తున్న సమయంలో ఆలూర్ నుంచి వెల్మల్ వెళ్తున్న కారు ఢీకొంది. క్షతగాత్రుడిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు తెలిపారు.

వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడి మృతి



దేవేందర్ (ఫైల్)

కామారెడ్డి అర్బన్: విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ)జిల్లా ఉపాధ్యక్షుడు వంజరి దేవేందర్(55) గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. దేవేందర్ 30 ఏళ్లుగా భారతీయ జనతా పార్టీలో కొనసాగుతు కామారెడ్డి పట్టణ పార్టీ అధ్యక్షుడిగా, ఇతర పదవుల్లో కొనసాగారు. మూడేళ్లుగా విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కామారెడ్డి పట్టణ గణేశ్ నవరాత్రి ఉత్సవాలు, శ్రీదుర్గామాతా ఉత్సవాల్లో చురుగ్గా పాల్గొనేవారు. దేవేందర్ ఆకస్మిక మృతిపై బీజేపీ, వీహెచ్‌పీ నాయకులు సంతాపం తెలిపారు.

సైన్స్ భవనం పరిశీలన



సైన్స్ భవనాన్ని పరిశీలిస్తున్న వీసీ రవీందర్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో నిర్మాణంలో ఉన్న సైన్స్ భవనాన్ని వీసీ రవీందర్ గురువారం సందర్శించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దేవదాస్, కాంట్రాక్టర్ రాజన్నకు పలు సూచనలు చేశారు. భవనం పనులు రెండు మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. భవనంతో పాటు పరిసరాలను అందంగా తీర్చిదిద్దాలని, కంప్యూటర్ సైన్స్ బిల్డింగ్ నుంచి నూతన భవనం వరకు డబుల్ రోడ్డు విస్తరణ పనులు త్వరలో ప్రారంభించాలని ఏఈ వినోద్‌ను ఆదేశించారు.

ఆర్ట్స్ కళాశాల తనిఖీ

యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాలను వీసీ తనిఖీ చేశారు. విద్యార్థులు తరగతులకు రెగ్యులర్‌గా హాజరు కావాలన్నారు. త్వరలో జరిగే సెమిస్టర్ పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. ఆర్ట్స్ కళాశాల పార్కింగ్ స్థలం సరిపోవడం లేదని విస్తరించాలని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణరెడ్డి కోరారు. రిజిస్ట్రార్ విద్యావర్ధిని, ఈసీ మెంబర్, అధ్యాపకులు నాగరాజు, ప్రవీణ్ మామిడాల, ప్రొఫెసర్ కనకయ్య, డాక్టర్ పున్నయ్య, డైరెక్టర్ పీఆర్‌వో ఎండీ జమీల్‌అహ్మద్, ఏపీఆర్ఓ శ్రీనివాస్ ఉన్నారు.

పీడీఎస్ బియ్యం లారీ బోల్తా

- ఆటోపై పడ్డ బియ్యం బస్తాలు
- తల్లి, కొడుకులకు గాయాలు



గాయపడిన యశోద



బోల్తా పడిన లారీ

నాగిరెడ్డిపేట: పీడీఎస్ బియ్యం లోడ్‌తో వెళ్తున్న లారీ మండలంలోని బంజరతండా వద్ద గురువారం రాత్రి అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీలోని బియ్యం బస్తాలు ట్రాలీ ఆటోపై పడడంతో ఆటో సైతం బోల్తాపడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న తల్లికొడుకులిద్దరూ గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. పీడీఎస్ బియ్యం లోడ్‌తో ఎల్లారెడ్డి నుంచి నర్సాపూర్ వద్ద గల తునికికి లారీ వెళ్తుంది. బంజరతండా వద్దకు చేరుకోగానే అదుపుతప్పి రోడ్డుకింకు దూసుకువచ్చి బోల్తా పడింది. అదే సమయంలో ఆత్మకూర్ గ్రామానికి చెందిన చిత్తారి రమేష్ తన తల్లి యశోదతో కలిసి ట్రాలీ ఆటోలో గోపాల్‌పేట నుంచి ఆత్మకూర్ బయల్దేరాడు. లారీ దూసుకొస్తుండటంతో ఆటోడ్రైవర్ రమేష్ తన ఆటోను రోడ్డుకిందకు తీసుకెళ్లాడు. అయినా లారీ బోల్తా పడి అందులోని బస్తాలు ఆటోపై పడ్డాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న యశోదతోపాటు ఆమె కొడుకు రమేష్ గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్సై ఆంజనేయులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. లారీడ్రైవర్ గణేశ్‌కు డ్రంకన్ డ్రైవ్ పరీక్ష చేయగా డ్రైవర్ తాగినట్లు తేలిందని ఎస్సై తెలిపారు.

మద్యం తాగించి హత్యాచారం

- మహిళ హత్య కేసు ఛేదించిన పోలీసులు

మాచారెడ్డి: మాచారెడ్డి మండలం గజ్యానాయక్ తండా శివారులో జరిగిన మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. మద్యం తాగించి ఇద్దరు నిందితులు ఆమెను అత్యాచారం చేసి, హత్య చేసినట్లు కామారెడ్డి రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన వివరాలు వెల్లడించారు.. ఈ నెల 3న మండలంలోని గజ్యానాయక్ తండా శివారులో అనుమానాస్పదంగా మృతి చెందిన ఓ మహిళా మృతదేహం లభ్యమైంది. మాచారెడ్డి ఎస్సై ఆధ్వర్యంలో జరిపిన విచారణలో ఆ మహిళ రాజన్న సిరిసిల్ల జిల్లా గొరింటాలకు చెందిన వీఆర్ఏ గాదం వెంకటవ్వ(48)గా గుర్తించారు. స్థానికంగా ఉన్న సీసీ పుటేజీల ఆధారంగా జనవరి 28న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన అలకుంట్ల సాయిలు, మంద దేవయ్యతో వెంకటవ్వ గజ్యానాయక్ తండా సమీపంలోని దర్గా వద్ద మద్యం తాగినట్లు సీఐ వివరించారు. మద్యం మత్తులో ఆ ఇద్దరు వెంకటవ్వను అత్యాచారం చేసి, హత్య చేసినట్లుగా విచారణలో తేలినట్లు సీఐ వెల్లడించారు. వారిద్దరి మీద ఇప్పటికే పలు కేసులు ఉన్నట్లు తెలిపారు. నిందితులను త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు.

భర్తను చంపిన భార్యకు ఐదేళ్ల జైలు

ఖలీల్‌వాడి: భర్త మృతికి కారణమైన భార్యకు ఐదు సంవత్సరాల కఠిన కారగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ జిల్లా సెషన్స్ జడ్జి సునీత కుంచాల గురువారం తీర్పు వెల్లడించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పిడుగు రవిరాజ్ తెలిపిన వివరాలు.. సిరికొండ మండలం రావుట్ల గ్రామానికి చెందిన నాయిడి గంగారాంకు ఇందల్వాయి మండలం ఎల్లారెడ్డిపల్లికి చెందిన సాయమ్మతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమార్తె మమతకు డిచ్‌పల్లి మండలం యానాంపల్లి గ్రామానికి చెందిన రాజ్‌కుమార్‌తో పెళ్లి జరిగింది. బతుకు దెరువు కోసం గంగారాం గల్ఫ్‌కు వెళ్లి వచ్చారు. గల్ఫ్ నుంచి వచ్చిన గంగారాం ఎలాంటి పని లేకుండా తిరిగేవాడు. దీంతోపాటు భార్యపై అనుమానం పెంచుకొని వేధించేవాడు. భర్త బాధలు తట్టుకొలేని సాయమ్మ, తన కూతురు మమత సాయంతో 2019 జులై 8న హత్య చేసింది. నేరం రుజువు కావడంతో సాయమ్మకు ఐదేళ్ల జైలుశిక్ష, రూ.రెండు వేల జరిమానా విధించారు. మమతపై నేరం రుజువు కానందున నిర్దోషిగా విడుదల చేశారు.

ఇసుక డంపుల సీజ్



బాన్సువాడ టౌన్: అనుమతి లేకుండా డంప్ చేసిన ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ గంగాధర్ తెలిపారు. పట్టణంలోని బీసీ హాస్టల్ రోడ్డులో సుమారు 100 ట్రాక్టర్ల ఇసుక డంపు చేశారన్నారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో సీజ్ చేశామని చెప్పారు. ఇసుక డంపుల వద్ద వీఆర్ఏలను కాపాల పెట్టామని తెలిపారు. బీర్కూర్ మండలం దామరంచ మంజీర ప్రాంతం నుంచి అక్రమంగా బాన్సువాడకు ఇసుకను తరలిస్తున్నారని చెప్పారు. బుధవారం అదే రహదారి వెంట వెళ్తున్న కలెక్టర్ వాహనానికి సైతం దారి ఇవ్వకుండా ఇసుకను తరలించారని తెలిపారు. 19 ట్రాక్టర్లను సీజ్ చేశామని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మంజీర నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌లను అధికారులు పట్టుకున్నట్లు తహసీల్దార్ రాజు తెలిపారు. బీర్కూర్‌కు చెందిన నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నామని చెప్పారు. అంతేగాకుండా బీర్కూర్, నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను సీజ్ చేశామన్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య



అంజయ్య(ఫైల్)

నాగిరెడ్డిపేట: అనారోగ్య కారణాలతో ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం మండలంలోని రాఘవపల్లిలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన ఏనుగుల అంజయ్య(59)కు కొంతకాలం క్రితం పక్షవాతం వచ్చింది. కుటుంబ సభ్యులు ఆయనకు చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో పక్షవాతం గురించి ఆయన తరుచూ మదన పడేవాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ క్రమంలో గురువారం వేకువ జామున అంజయ్య కాలకృత్యాలు తీర్చుకునేందుకని వెళ్లి తాడుతో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రామవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

కామారెడ్డిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని..

కామారెడ్డి క్రైం: కామారెడ్డిలోని విద్యానగర్ కాలనీలో నివాసం ఉండే ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని గురువారం ఆత్మహత్య చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీలో నివాసం ఉండే తాటిపాముల స్వప్న, కిరణ్ కుమార్‌గౌడ్‌కు కుమారుడు, కుమార్తె అభిజ్ఞ(23) ఉన్నారు. అభిజ్ఞ హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా పనిచేస్తుంది. ప్రస్తుతం ఆమె వర్క్ ఫ్రం హోం చేస్తున్నారు. గురువారం ఉదయాన్నే తల్లిదండ్రులు ఇద్దరు డ్యూటీలకు వెళ్లారు. నాలుగు గంటల ప్రాంతంలో ఇంటికి తిరిగివచ్చి చూసేసరికి తలుపులు మూసి ఉన్నాయి. ఎంత పిలిచినా తలుపులు తీయకపోవడంతో కిటికీలోంచి గమనించారు. అప్పటికే అభిజ్ఞ హాలులోని కొక్యానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించింది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. తమ కుటుంబంలో ఎలాంటి సమస్యలు లేవనీ, అభిజ్ఞ ఆత్మహత్య ఎందుకు చేసుకుందో తెలియడం లేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌ఓ నరేష్ తెలిపారు.

అనారోగ్యం, భార్యపై బెంగతో భర్త..

చనిపోయిన భార్యపై బెంగ, అనారోగ్య కారణాలతో ఒకరు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన కామారెడ్డి మండలం ఉగ్రవాయిలో గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పోలకేని బుచ్చయ్య(58) భార్య రెండు నెలల క్రితం చనిపోయింది. ఏడాది క్రితం బుచ్చయ్యకు గుండె ఆపరేషన్ జరిగింది. అప్పటి నుంచి ఆరోగ్యం సరిగా ఉండడం లేదు. దీంతో కొద్ది రోజులుగా మనస్తాపానికి గురవుతున్నాడు. గురువారం మధ్యాహ్నం తాను నివాసం ఉండే గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. దేవునిపల్లి పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.